# బిఎస్ఎన్ఎల్ అధికారుల ఉద్యోగుల అసోసియేషన్ల/ యూనియన్ల సంయుక్త వేదిక, న్యూఢిల్లీ

## బిఎస్ఎన్ఎల్ అధికారులు మరియు ఉద్యోగులకు విజ్ఞప్తి

### బిఎస్ఎన్ఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణ (ఐపిఓకు)ను ఓడించడానికి జరిగే పోరాటానికి సిద్ధం కండి!

తిరిగి అధికారంలోకి వచ్చిన యుపిఏ ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్‌తో సహా అనేక ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడులను ఉప సంహరించాలని చూస్తోంది. కారు చౌకగా ప్రభుత్వరంగ సంస్థలని కొనాలని చూస్తున్న భారతీయ మరియు విదేశీ బడా పెట్టుబడిదారులను సంతృప్తి పరచడానికి, తద్వారా గాలివాటు లాభాలను పొందాలని చూస్తున్న పెట్టుబడిదారులకు సహాయపడాలన్నది ప్రభుత్వం ఉద్దేశం. గత ప్రభుత్వ హయాంలో కూడా అనేక ప్రభుత్వరంగ సంస్థలలో యుపిఏ ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణకు ప్రయత్నించినా, యూనియన్ల నుండి, వామపక్షాల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమైన కారణంగా, వామపక్షాల మద్దత్తుపై ఆధారపడిన కారణంగా అది సాధ్యపడలేదు. ఈ పర్యాయం వామపక్షాల మద్దతు అవసరం లేకుండానే అవసరమైన బలం పార్లమెంటులో సాధించిన కారణంగా, యుపిఏ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలలో పెట్టుబడుల ఉపసంహరణ విషయంలో ముందుకు వెళ్ళాలని చూస్తోంది.

ఈ విధమైన ప్రభుత్వ విధానంలో భాగంగా బిఎస్ఎన్ఎల్ బోర్డు బిఎస్ఎన్ఎల్‌లో 10% పెట్టుబడులను ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఓ) ద్వారా ఉపసంహరించాలని ప్రతిపాదించింది. మీడియా వార్తల ప్రకారం కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ ఎ. రాజా ఈ విషయంలో యూనియన్లతో చర్చించి, డిజిన్వెస్ట్‌మెంటు విషయంలో వారిని ఒప్పించాలని మేనేజ్‌మెంటును ఆదేశించారు. మీడియా వార్తల ప్రకారం గతంలో ఉద్యోగులు తిరస్కరించిన పది రూపాయల షేరు విలువతో ఒక్కో ఉద్యోగికి 500 షేర్లు ఇవ్వాలన్న ప్రతిపాదనకు మరిన్ని షేర్లు పెంచి ఉద్యోగులకు ఇవ్వజూపాలనీ, తద్వారా పెట్టుబడుల ఉపసంహరణకు అంగీకరించేలా చేయాలనీ చూస్తున్నారు. పెట్టుబడుల ఉపసంహరణకు ఉద్యోగులను ఎలాగైనా అంగీకరింపజేసే చర్యలలో భాగంగా వేతన సవరణలో అధిక వేతనాలు, అలవెన్సులు, ప్రమోషన్లు మరియు ఇతర బెనిఫిట్లు ఇవ్వ జూపనున్నారని మీడియా వార్తలు సూచిస్తున్నాయి. ఉద్యోగులు డిజిన్వెస్ట్‌మెంటుకు అంగీకరిస్తే బిఎస్ఎన్ఎల్‌కు నవరత్న హోదా కల్పిస్తారని కూడా మీడియాలో వార్తలు వచ్చాయి. డిజిన్వెస్ట్‌మెంటు ద్వారా వచ్చిన మొత్తాన్ని బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి వినియోగిస్తారని వదంతులు వ్యాపించాయి.

అయితే ఇక్కడ మనం ఒక విషయం అర్థం చేసుకోవలసి ఉంది. డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా వచ్చిన మొత్తంలో ఒక్క నయాపైసా కూడా బిఎస్ఎన్ఎల్‌కు ఇవ్వబడదు. డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా లభించిన మొత్తాన్ని, 'జాతీయ మదుపు నిధి'లో డిపాజిట్ చేస్తారు. ఈ ఫండ్‌ను నిర్వహించే ఫండ్ మేనేజరు ఈ మొత్తాలను ఎక్కడెక్కడ పెట్టుబడులుగా పెట్టాలో నిర్ణయించి ఆ మేరకు పెట్టుబడులు పెడతారు. మూలధనాన్ని వాడుకోకుండా, మూలధనంపై వచ్చిన లాభాలను ప్రభుత్వానికి చెల్లిస్తారు. ప్రభుత్వం ఈ మొత్తంలో 75% సామాజిక అభివృద్ధి పథకాల కోసం, మిగిలిన 25% మూతబడిన ప్రభుత్వరంగ సంస్థల పునరుద్ధరణ కోసం వినియోగిస్తుంది. ఈ రకంగా డిజిన్వెస్ట్‌మెంటు ద్వారా వచ్చిన మొత్తంలో ఒక్క నయాపైసా కూడా బిఎస్ఎన్ఎల్‌కు రాదు. కనుక డిజిన్వెస్ట్‌మెంటు ద్వారా వచ్చిన మొత్తాన్ని బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి, ఉద్యోగులకు అధిక వేతనాలు ఇవ్వటానికి వినియోగిస్తారన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. డిజిన్వెస్ట్‌మెంటు చేయాలన్న నిర్ణయం వెనుక బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి కాని, ఉద్యోగుల సంక్షేమం కాని ముఖ్యోద్దేశం కాదు. దీని వెనుక ముఖ్యోద్దేశం బిఎస్ఎన్ఎల్‌ను దఫాలావారీగా ప్రైవేటీకరించాలనీ, అందులో భాగంగానే మొదటగా 10% వాటాలు అమ్మి తరువాత మెల్లమెల్లగా 51% దాకా వాటాలు అమ్మి చివరగా భవిష్యత్తులో సమయం చూసుకుని బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరించడం దీని ఉద్దేశం. సంస్థలో 51% వాటా ప్రభుత్వం దగ్గరే ఉంటుందని ప్రకటించడం ప్రజలను, ఉద్యోగులను మోసం చేసేందుకు ఉద్దేశించింది మరియు కంటితుడుపు చర్యే.

బిఎస్ఎన్ఎల్ సంస్థలో 10% వాటాల విక్రయం వల్ల మార్కెట్‌లో బిఎస్ఎన్ఎల్ మార్కెట్ విలువ ఎంతో తెలుస్తుందనీ, తద్వారా మార్కెట్‌లో బిఎస్ఎన్ఎల్ షేర్ల విలువ పెరగటం ద్వారా వచ్చే విలువని బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి కోసం మేనేజ్‌మెంటు కృషి చేస్తోందనీ చేసే వాదన శుద్ధ అబద్ధం. ఎమ్‌టిఎన్ఎల్‌లో డిజిన్వెస్ట్‌మెంటు వల్ల దాని అభివృద్ధి జరుగకపోగా, పరిస్థితులు మరింతగా దిగజారి, కనుక డిజిన్వెస్ట్‌మెంటు మరింతగా జరిగింది.

బిఎస్ఎన్ఎల్ మార్కెట్ విలువ 4,00,000 కోట్లనీ, ఇందులో 10% వాటాలు అమ్మితే ప్రభుత్వానికి 40,000 కోట్లు వస్తాయనీ, ఆ మొత్తాన్ని సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం వాడుతుందనీ చెబుతున్నారు. అయితే బిఎస్ఎన్ఎల్ నిజ విలువ 4 లక్షల కోట్లు కాదు అది 40 లక్షల కోట్లు. బిఎస్ఎన్ఎల్ విలువని తక్కువగా చూపి దాని షేర్లని కారుచౌకగా అమ్మి భారత, విదేశీ బడా పారిశ్రామికవేత్తలకి మేలు చేయడం దీని ఉద్దేశం.

ఈ రకంగా పెట్టుబడులు ఉపసంహరించగా వచ్చిన సొమ్ము నిజానికి ప్రభుత్వం దగ్గర కూడా ఉండదు. ఈ మొత్తాన్ని 'జాతీయ మదుపు నిధి'లో జమచేసి, షేర్ మార్కెట్ స్పెక్యులేషన్‌లో ఉంచే పనిని ఫండ్ మేనేజర్ నిర్వహిస్తారు. ఈ స్పెక్యులేషన్ వల్ల వచ్చే లాభాలను మాత్రం ప్రభుత్వానికి ఇస్తారు. ఈ రకంగా ఈ పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ మొత్తం కొంతమంది బడా పెట్టుబడిదారుల లాభాల కోసం (వారు ఇండియా వారైనా లేక విదేశీయులైనా) జరుగుతోంది. దీనివల్ల దేశానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరించే ఈ ప్రక్రియను మొదటి మెట్టులోనే మనం అడ్డుకోకపోతే దఫాలవారీగా వాటాలు అమ్మటం ద్వారా చివరకు ప్రైవేటీకరణకు దారి తీస్తుంది. తద్వారా మన ఉద్యోగాలు మరియు పెన్షను ప్రమాదంలో పడతాయి. ఎప్పుడైతే ప్రభుత్వ రంగ సంస్థలయిన బిఎస్ఎన్ఎల్ మరియు ఎంటిఎన్ఎల్ లేవో అప్పుడు ప్రైవేటు టెలికం కంపెనీలన్నీ ఒక్కటై టెలికం సర్వీసుల టారిఫ్‌లను విపరీతంగా పెంచేస్తారు. ఒకవైపు జాతీయ సంపద అయిన బిఎస్ఎన్ఎల్‌ను కారుచౌకగా అమ్మేస్తూ మరోవైపు టెలికాం సర్వీసుల రంగం మొత్తాన్ని ప్రైవేటు టెలికాం కంపెనీల చేతుల్లో పెట్టడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయటమే.

అమెరికా, జర్మనీ, ఫ్రాన్సు లాంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక మాంద్యం కారణంగా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులలో, భారతదేశాన్ని ఈ ఆర్థిక సంక్షోభం తాకకపోవడానికి మన ఆర్థిక మూలాలు బలంగా ఉండటమే కారణమని ప్రభుత్వం సంతోషంగా ప్రకటిస్తోంది. ఆర్థిక మూలాలు అంటే జాతీయ బ్యాంకులు, జాతీయ ఇన్సూరెన్స్, పరిశ్రమలు మరియు అనేక ఇతర సర్వీసులు ప్రభుత్వరంగంలో ఉండటమే. దేశ ఆర్థిక ప్రగతి ప్రభుత్వరంగాన్ని బలోపేతం చేయటంలోనే ఉందని దీనివల్ల రుజువయింది. అయినా సరే యుపిఏ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల్ని అమ్మివేయాలనే చూస్తోంది. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం ఏమిటంటే, అమెరికాలో ప్రపంచపు ప్రైవేటు కార్పొరేషన్‌లలో అతి పెద్దదయిన 'జనరల్ మోటార్సు' ఈ ఆర్థిక సంక్షోభం కారణంగా దివాలా తీస్తే అమెరికన్ ప్రభుత్వం దాన్ని కాపాడానికి ఆ కంపెనీని కొనాలనుకుంటోంది. ప్రైవేటు కంపెనీలను జాతీయం చేసే ప్రక్రియ అమెరికా మరియు అనేక ఇతర అభివృద్ధి చెందిన దేశాలలో ప్రారంభం అయింది.

ప్రైవేటు కంపెనీలను జాతీయం చేసే విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రారంభమయితే, యుపిఏ ప్రభుత్వం ఎందుకు ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రైవేటీకరించాలి? దీనికి కారణం ఒక్కటే. కొద్దిమంది బడా విదేశీ, స్వదేశీ పారిశ్రామికవేత్తలకి లాభం చేకూర్చటానికే.

బిఎస్ఎన్ఎల్ లేదా మరే ఇతర ప్రభుత్వరంగ సంస్థల డిజిన్వెస్ట్‌మెంటు ద్వారా వచ్చిన నిధులను సామాజిక అభివృద్ధి పథకాలు నిర్వహించడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదం చేసేలా చేస్తామన్న వాదనలో బలం లేదు. సామాజిక అభివృద్ధి పథకాల నిర్వహణ కోసం నిధులను సమీకరించడానికి ప్రభుత్వరంగ సంస్థలనే అమ్మనక్కరలేదు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకుండా, సామాన్య ప్రజలపై భారం వేయకుండా సామాజిక అభివృద్ధి పథకా లనిర్వహణకు నిధులను ఎలా సమీకరించుకోవచ్చో ఆర్థికమంత్రి శ్రీ ప్రణబ్‌ముఖర్జీని కలిసి ట్రేడ్ యూనియన్లు వివరించాయి. నిధుల సమీకరణ కోసం స్విస్‌బ్యాంకులలోని నల్లధనాన్ని తీసుకురావచ్చనీ, ధనికుల పైన మరిన్ని పన్నులు విధించవచ్చనీ, ధనికులు బకాయిపడ్డ పన్నుల్ని వసూలు చేయవచ్చనీ, బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు అనవసరంగా కల్పిస్తున్న రాయితీలను రద్దు చేయడం ద్వారా సైతం నిధుల్ని సమీకరించుకోవచ్చనీ తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేయవచ్చనీ యూనియన్లు ఆర్థికమంత్రికి సూచించాయి.

డిజిన్వెస్టుమెంటు అన్నది ఉద్యోగులకు, దేశ ప్రయోజనాలకు బిఎస్ఎన్ఎల్‌కు వ్యతిరేకమైన దృష్ట్యా బిఎస్ఎన్ఎల్ అధికారుల మరియు ఉద్యోగుల అసోసియేషన్స్ / యూనియన్ల జాయింట్ ఫోరం బిఎస్ఎన్ఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణను వ్యతిరేకించాలని నిర్ణయించింది. బిఎస్ఎన్ఎల్‌లో డిజిన్వెస్ట్‌మెంటు జరగకుండా ఉండే పోరాటానికి సమైక్యంగా అందరు ఉద్యోగులూ మద్దతు పలకాలని ఫోరం విజ్ఞప్తి చేస్తోంది. దేశభక్తులైన అందరు ప్రజలూ మరియు రాజకీయ పార్టీలూ ఈ పోరాటానికి తప్పక మద్దతు పలుకుతారని ఆశిస్తోంది.

93 మిలియన్ లైన్ల జిఎస్ఎమ్ పరికరాల కోసం పిలిచిన టెండరు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయటం ద్వారా జిఎస్ఎమ్ సెల్‌ఫోన్లు భారీ ఎత్తున ఇవ్వడానికి తగిన ప్రయత్నాలు చేయాలని జాయింట్ ఫోరం డిమాండ్ చేస్తోంది. బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి కోసం తగిన చర్యలు మేనేజ్‌మెంటు వెంటనే తీసుకోవాలని జాయింట్ ఫోరం డిమాండ్ చేస్తోంది.

బిఎస్ఎన్ఎల్ అభివృద్ధి కోసం నిధులు అవసరమైన పక్షంలో రిజర్వు ఫండు నిధుల్ని వాడుకోవాలనీ, ఇంకా అవసరమైన పక్షంలో మార్కెట్ నుండి సేకరించుకోవచ్చనీ జాయింట్ ఫోరం సూచిస్తోంది.

నైపుణ్యం గల మానవశక్తి వున్న బిఎస్ఎన్ఎల్ ఆ శక్తిని సక్రమంగా వాడుకొంటూ అభివృద్ధి చెందటానికి తగిన వ్యూహాలు రూపొందించుకోవాలి.

కనుక బిఎస్ఎన్ఎల్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను అడ్డుకోవటానికి జరిగే ఉద్యమానికి బిఎస్ఎన్ఎల్‌లోని ప్రతి ఉద్యోగి కలిసికట్టుగా పోరాడాలని, బిఎస్ఎన్ఎల్ పరిరక్షణకు, అభివృద్ధికి ఉద్యమించాలనీ జాయింట్ ఫోరం పిలుపునిస్తోంది.

భవదీయుడు

సం/-

**వి.ఏ.ఎన్. నంబూదిరి**

**కన్వీనరు, బిఎస్ఎన్ఎల్ అధికారుల/ఉద్యోగుల**

**అసోసియేషన్లు/యూనియన్ల సంయుక్త వేదిక**